
కుంటిమద్దిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


ప్రచారంలో పాల్గొన్న ప్రజలు, కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీతోనే పేదలకు మేలు

- పెత్తందార్లను నమ్మి మోసపోవద్దు
- వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తేనే సంక్షేమం
- సీఎం జగన్ హామీలన్నీ నెరవేరుస్తారు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: పెత్తందార్లను నమ్మి మోసపోవద్దు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తే ప్రతి ఇంటికీ మేలు జరుగుతుందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కుంటిమద్ది, శ్రీహరిపురం, సుద్దకుంటపల్లి, శేషంపల్లి, చెర్లోపల్లి, పోలేపల్లి, పాపిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐదేళ్లు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించారు.. ఈ ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. 30 ఏళ్లుగా చుక్క నీరులేక కళ తప్పిన పేరూరు డ్యాంకు కృష్ణా జలాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. గతంలో పరిటాల కుటుంబం మంత్రులు, ఎమ్మెల్యేలుగా పని చేసినా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. దోచుకుని, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మాత్రం గ్రామాల్లోకి వచ్చి మేం అధికారంలోకి వస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ ప్రజలను మభ్యపెడతారన్నారు. డ్వాక్రా, రైతు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన టీడీపీ.. ప్రజలను నిలువునా మోసం చేసిందని మండిపడ్డారు. మోసం చేసిన చరిత్ర టీడీపీ వారిదే అన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను నెరవేర్చడం జరిగిందన్నారు. దేశంలోనే ఎక్కడా లేనటువంటి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ఉదయాన్నే ఇంటి వద్దకే పింఛన్లు అందించామన్నారు. అదే విధంగా కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేలా సీఎం జగనన్న చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పేరూరు డ్యాంను మూడు సార్లు కృష్ణా జలాలతో ఇప్పటికే రామగిరి, కనగానపల్లి మండలాల్లో సోలార్‌ప్లాంట్‌కు రైతులు భూములిచ్చారని వెల్లడించారు. త్వరలోనే ఈ ప్రాంతాల్లో సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వేల మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. రామగిరి బంగారు గనులు తెరిపించేందుకు సన్నాహాలు పూర్తి అయ్యాయని తెలిపారు. త్వరలోనే గనులను తెరిపించి ఉపాధి కల్పిస్తామన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామని స్పష్టం చేశారు. ఇప్పుడు ఎన్నికలు రావడంతో మాయమాటలు చెప్పి ప్రజలను మరోసారి ప్రజలను మోసగించేందుకు టీడీపీ నాయకులు వస్తున్నారన్నారు. వీరికి గట్టిగా బుద్ధి చెప్పాలని సూచించారు. మరోసారి వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను, ఎమ్మెల్యేగా నన్ను ఆశీర్వదించాలని కోరారు. ఈ ఎన్నికల్లో టీడీపీని ఘోరంగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగరాజు, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ కర్రా హనుమంత రెడ్డి, సర్పంచులు రాజేష్, సిద్ధన్న, చెన్నకేశవరెడ్డి, నరేంద్ర, ఓబిరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, ఆదిరెడ్డి, వెంకటరెడ్డి, సుబ్రహ్మణ్యం, రామకృష్ణారెడ్డి, జయచంద్రారెడ్డి, సాకే ఆది, జనార్దన్, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదేళ్లలో రూ.1,045 కోట్ల అభివృద్ధి

- నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశాం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


రాణినగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి డివైడర్లకే పరిమితమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనంతపురం నియోజకవర్గంలో రూ.1,045 కోట్ల అభివృద్ధి చేసి చూపామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం నగరంలోని 8వ డివిజన్, సాయంత్రం రాజీవ్ కాలనీ పంచాయతీలో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో వివిధ డివిజన్లలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఒక్కో డివిజన్‌లో రూ.2 కోట్లకు పైగానే అభివృద్ధి పనులు చేశామన్నారు. రాణినగర్, భాగ్యనగర్, తదితర నగర శివారు ప్రాంతాల్లోనూ ప్రజల రాకపోకలకు అనువుగా రోడ్లు, కాలువలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. నియోజకవర్గంలో రోడ్లు, కాలువల అభివృద్ధికి రూ.800 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు.

నగరాలకు దీటుగా పంచాయతీల అభివృద్ధి

నగరాలకు దీటుగా పంచాయతీల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు. ఒక్క రాజీవ్ కాలనీలోనే రూ.16 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. అధునాత బ్రిడ్జ్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. అనంతపురం రూరల్‌లో రూ.25 కోట్లు, రుద్రంపేటలో రూ.41 కోట్లు, ఏ.నారాయణపురంలో రూ.43 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ ఎన్నికల్లోనూ మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ అనంతపురం, హిందూపురం నియోజకవర్గాల డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్ రాగే పరుశురాం, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థ నాయక్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమా, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, రాజీవ్‌కాలనీ సర్పంచ్ ఆశాబీ, ఎంపీటీసీ సంధ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్ రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, కార్పొరేటర్ దేవి, సుమతి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ మోహన్, లక్ష్మణ్, నాయకులు అనిల్‌కుమార్ గౌడ్, రామ్, అమర్‌నాథ్ రెడ్డి, రాజారత్నం, గంగాధర్, లబ్బే రాఘవ, గౌరి, రాధాయాదవ్, హుస్సేన్, అంజి, దౌలా, రహీమ్, కరీం, మారెన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు 33వ డివిజన్‌లో..

నగరంలోని 33వ డివిజన్‌లో ఆదివారం సాయంత్రం 3:30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. డివిజన్‌లోని కృపానంద నగర్ జెండా కట్ట నుంచి ప్రచార కార్యక్రమం మొదలవుతుందన్నారు.

ఎమ్మెల్యే కుటుంబీకుల ప్రచారం..

ఈ ఎన్నికల్లో అనంతపురం ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కుటుంబీకులు కోరారు. శనివారం నగరంలోని 6, 49వ డివిజన్లలో విస్తృత ప్రచారం చేశారు. నగరంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి మీరే సాక్ష్యమన్నారు. మరోసారి ఎమ్మెల్యేను గెలిపించుకుంటే మరింత అభివృద్ధి, అర్హులందరికీ సంక్షేమం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబీకులు అనంత మాలతి, అనంత సువర్ణ, అనంత మేఘన, అనంత లిఖిత్‌రెడ్డి, కార్పొరేటర్ సుజాత పాల్గొన్నారు.


6వ డివిజన్‌లో ఓటు అభ్యర్థిస్తున్న అనంత మేఘన

క్లుప్తంగా

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని గెలిపించాలి


పేరూరు పంచాయతీలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న నాయకులు

రామగిరి: ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శనివారం పేరూరు పంచాయతీలోని కురుగుండ్ల కాలనీ, పేరూరులో ఎంపీపీ మీనుగ నాగరాజు, సర్పంచ్ రాజేష్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను లబ్ధిదారులకు వివరించారు. రాప్తాడులో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామన్నారు. కార్యక్రమంలో దాసరి మోహన్, మల్లికార్జున, బేగుల రాజు, గుడుసాల వెంకటేశులు, ఈశ్వరయ్య, వెంకటరెడ్డి, నారాయణ, వెంకటేష్, ముత్యాలు, పల్లినారాయణ, ఆనంద్, ముజుబుర్ రహిమాన్, నారాయణ రెడ్డి, రామకృష్ణ, బాలరాజు, అశ్వర్థనారాయణ, కెజి.నాగనాజు, పెద్దన్న, హరి తదితరులు పాల్గొన్నారు.

ఎండల తీవ్రత తాళలేక వృద్ధురాలి మృతి


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని నాగసముద్రం గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు ఎండల తీవ్రత తాళలేక శనివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. దళితవాడకు చెందిన ముత్యాలమ్మ (70) ఎండ తీవ్రత తాళలేక మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ సుధారాణి ఓబుళేసు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముత్యాలమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు మృతురాలి కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్


సబ్జెక్టుకు సంబంధించిన అంశాలను కాలిపై రాసుకున్న విద్యార్థిని

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం యూజీ రెండు, ఆరు సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడ్డారు. దీంతో వారిద్దరినీ డిబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ఎస్‌ఎల్‌ఎన్ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థిని కాలిపై సబ్జెక్టుకు సంబంధించిన అంశాలను రాసుకొచ్చి కాపీ కొడుతుండగా పట్టుకున్నారు. పరీక్షల అధికారులు ఆ విద్యార్థినిపై చర్యలు తీసుకున్నారు.

టీడీపీ మేనిఫెస్టో బూటకం

రాప్తాడు: అమలు కాని హామీలతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకే చంద్రబాబు బూటకపు మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వస్తున్నారు. ఆ హామీలను నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ సీనియర్ మహిళా నాయకురాలు తోపుదుర్తి నయనతా రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పాలచెర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. అందులో భాగంగానే 2019 ఎన్నికల మేనిఫెస్టోను తూచా తప్పకుండా అమలు చేశారని గుర్తు చేశారు. ప్రజలకు మరింతగా పథకాలు అందించేందుకు ఉత్తమ మేనిఫెస్టో విడుదల చేశారని తెలిపారు. జగనన్న సహకారంతోనే రాప్తాడు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దామన్నారు. నియోజకవర్గంలో ఆరు మండలాల్లో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించామన్నారు. ప్రజలకు మంచి చేసి ఓటు అడుగుతున్నామని పేర్కొన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, నరేంద్ర రెడ్డి, దేవర ఎర్రిస్వామి, గంగిరెడ్డి, బిల్లే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న తోపుదుర్తి నయనతా రెడ్డి

ఉప్పరపల్లిలో ఇంటింటా ప్రచారం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామంలో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకురాలు తోపుదుర్తి నయనతారెడ్డి ఇంటింటా ప్రచారం చేపట్టారు. జగనన్న పాలనలో ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉందన్నారు. సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందాయన్నారు. మళ్లీ అలాంటి పాలన కావాలంటే జగనన్న ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. అన్ని వర్గాల మేలు కోరే ఫ్యాన్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, సర్పంచ్ సావిత్రి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రవిశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ భాస్కర్, నాయకులు రామస్వామి, కట్ల శీనా, గణేష్, గోపాల్, రాజారెడ్డి, నలపరెడ్డి, కొండారెడ్డి, అంజి, కృష్ణ, బండి ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

రాప్తాడు: టీడీపీ ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకుని వచ్చినా ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సతీమణి తోపుదుర్తి మనోరమ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోయ శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, అనంతపురం రూరల్ మండల కన్వీనర్ రాధమ్మతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారంలోకి వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయన్నారు. పథకాల కోసం జన్మభూమి కమిటీ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. సీఎం జగన్ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. జగనన్న ప్రభుత్వంలో పథకాలు నేరుగా ఇంటికే వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, బీసీ సెల్ నాయకుడు ఆది, మండల కన్వీనర్ శేఖర్, ఎస్సీ మండల కన్వీనర్ నారాయణ స్వామి, స్థానిక నాయకులు చిన్న కృష్ణారెడ్డి, బాల కృష్ణా రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జి.కొత్తపల్లిలో ప్రచారం చేస్తున్న తోపుదుర్తి మనోరమ రెడ్డి

రిజర్వేషన్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర

అనంతపురం కార్పొరేషన్: ముస్లిం మైనార్టీల 4 శాతం రిజర్వేషన్‌ను తొలగించాలని కుట్ర చేస్తున్న బీజేపీతో టీడీపీ జతకట్టింది. రిజర్వేషన్‌పై టీడీపీ, జనసేన నాయకులు స్పష్టత ఇవ్వకపోవడమే కాకుండా ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేయాలని టీడీపీ సీనియర్ నాయకులు అహ్మద్ షరీఫ్, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షారూఖ్ షబ్లీ ప్రచారం చేయడం సిగ్గుచేటని వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేస్తే బీజేపీకి ఓటు వేసినట్లే అన్నారు. వైఎస్సార్ చలవతోనే మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు లభించాయన్నారు. పేద, సామాన్య మధ్య తరగతి ముస్లిం మైనార్టీల పిల్లలు ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సైతం మైనార్టీలకు 4 శాతం కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. మైనార్టీల భవిష్యత్తు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందన్నారు. టీడీపీ పాలనలో మైనార్టీలకు రూ.2,665 కోట్లు ఖర్చు చేస్తే.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.22 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. అనంతపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో మైనార్టీలకు కీలక పదవులు దక్కాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మైనార్టీలందరూ వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు ఏ1రఫి, గఫ్ఫార్, హిదయతుల్లా, బీసీ సెల్ నాయకులు గోగుల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్

క్రీడల్లో రాణించాలి

ధర్మవరం అర్బన్: చిన్నారులు క్రీడల్లో రాణించాలని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని బాస్కెట్‌బాల్ సిమెంట్ కోర్టులో గురువారం ఉచిత బాస్కెట్‌బాల్ వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరం రోజూ ఉదయం 6 గంటల నుంచి 8 వరకు, సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు ఉంటుందన్నారు. కోచ్ సంజయ్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థకు ట్రైనీ కలెక్టర్


ట్రైనీ కలెక్టర్ వినూత్నను సన్మానిస్తున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థకు ట్రైనీ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న శిక్షణలో భాగంగా వచ్చారు. ఈనెల 16వ తేదీ వరకూ ఆమె నగరపాలక సంస్థలోని వివిధ సెక్షన్ల పనితీరుపై అవగాహన చేసుకుంటారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ వినూత్నను అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, కార్యదర్శి సంగం శ్రీనివాసులు కలసి శాలువా, పూలమాలతో సన్మానించారు.

రేపు అక్కల్ కోట మహారాజు ఆరాధన ఉత్సవాలు


పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: ఈనెల 6వ తేదీన అక్కల్ కోట మహారాజు 146 ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు విజయ్ కుమార్ తెలిపారు. శనివారం అనంత నగరంలోని హెచ్‌ఎల్‌సీ కాలనీలో కొలువైన అక్కల్ కోట మహారాజు ఆశ్రమంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 6వ తేదీన ఉదయం నగర సంకీర్తన, మహా గణపతి పూజ, కొల్హాపురి అమ్మవారికి కుంకుమార్చన, ఆధ్యాత్మిక ప్రవచనాలు, మహా మంగళ హారతి, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటాయన్నారు. సాయంత్రం స్వామి చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

మద్యం రవాణా, నాటుసారా తయారీపై నిఘా

ధర్మవరం అర్బన్: మద్యం రవాణా, నాటుసారా తయారీపై నిఘా పెట్టాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని సెబ్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. కేసుల రికార్డులు, ప్రాపర్టీని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. సెబ్ సీఐ వై.గురుప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

ఈవీఎంలపై అవగాహన తప్పనిసరి

రాప్తాడు: ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్ర కీలకం. పీఓ, ఏపీఓలకు ఈవీఎంలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఆర్వో వసంతబాబు అన్నారు. శనివారం మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీలో ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరుపై ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సిబ్బంది ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పీఓగా విధులు నిర్వహించడం గొప్ప అవకాశమని పేర్కొన్నారు. పోలింగ్ రోజున సంబంధిత పోలింగ్ కేంద్రంలో పీఓదే పూర్తి అధికారమని చెప్పారు. అందరి విధులపైనా పీఓలకు అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ రోజున సాంకేతికపరంగా సమస్యలు ఉత్పన్నమయితే ఏ విధంగా పరిష్కరించుకోవాలో కూలంకషంగా వివరించారు. ఈవీఎం, వీవీ ప్యాట్, కంట్రోల్ యూనిట్ పనితీరును పీఓ, ఏపీఓలకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గంలో రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ప్రతి చోట పోలింగ్‌కు 90 నిమిషాల ముందే తప్పనిసరిగా మాక్ పోల్ నిర్వహించాలని ఆదేశించారు. మాక్ పోల్ అనంతరం ఈవీఎంలు డిలీట్ చేసి, వీవీ ప్యాట్లు ఖాళీ చేసి సీల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఓలు, ఏపీఓలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పీఓ, ఏపీఓలకు అవగాహన కల్పిస్తున్న నోడల్ ఆఫీసర్లు

ఓటుహక్కు వినియోగించుకున్న ఉద్యోగులు


పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఉద్యోగులు


ఓటు వేస్తున్న ఉద్యోగి

రాప్తాడు: పోస్టల్ బ్యాలెట్ ద్వారా 636 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆత్మకూరు మండల తహసీల్దార్, ఎన్నికల నోడల్ ఆఫీసర్ పరమేశ్వరరావు తెలిపారు. మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డులోని టీటీడీసీ కేంద్రంలో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును నియోగించుకునేందుకు రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయమే ఉద్యోగులు అధిక సంఖ్యలో రావడంతో రెండు కేంద్రాల్లో క్యూలైన్లలో నిల్చొని ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. మొదటి రోజు శుక్రవారం 104 మంది ఉద్యోగులు, రెండవ రోజు శనివారం 532 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

శేషవాహనంపై విహరించిన శ్రీవారు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం శ్రీవారు సూర్యప్రభ వాహనం, శేష వాహనంపై ఊరేగారు. అర్చకులు పవిత్ర గంగాజలాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక అలంకరణ చేశారు. మధ్యాహ్నం సూర్యప్రభ వాహనంపై స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 8 గంటలకు శేషవాహనంపై స్వామిని ఊరేగించారు.


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి


సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

అనంతలో ప్రత్యక్షమైన కర్ణాటక బాలుడు


కర్ణాటక పోలీసులకు బాలుడిని అప్పగిస్తున్న అనంతపురం రైల్వే పోలీసులు

అనంతపురం సిటీ: కర్ణాటకలోని బళ్లారి జిల్లా సిరుగుప్ప బాలసదనం నుంచి పారిపోయి అనంతపురానికి చేరుకున్న ఓ బాలుడిని సురక్షితంగా ఆ రాష్ట్ర పోలీసులకు రైల్వే పోలీసులు అప్పగించారు. వివరాలు.. సిరుగుప్పకు చెందిన విశ్రాంత ఉద్యోగి కృష్ణాజీ కులకర్ణి కుమారుడు ఆత్రేష్ కులకర్ణి(16) మానసిక పరిస్థితి సరిగా లేదు. దీంతో సిరుగుప్పలోని బాలసదన్‌లో ఆశ్రయం కల్పించారు. అయితే ఆత్రేష్ కులకర్ణి అక్కడి సిబ్బంది కళ్లుగప్పి పారిపోయాడు. దీనిపై బాలసదన్ సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బళ్లారిలోని కౌల్‌బజార్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో అనంతపురం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలుడిని గుర్తించి జీఆర్పీ పోలీసులు ఇర్ఫాన్, కలైవాణి స్టేషన్‌కు తరలించి విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. దీంతో బళ్లారి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శనివారం ఉదయం బాలసదన్ సూపరింటెండెంట్ వచ్చి బాలుడిని తనతోపాటు పిలుచుకెళ్లారు.